వాడ వాడలా వేడుకలు



క్యాంపు కార్యాలయంలో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, కుటుంబసభ్యులు

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో దీపావళి వేడుకలు వాడవాడాల ఘనంగా జరిగాయి. ఇళ్ళముందు ప్రమిదలు వెలిగించి టపాసులు కాల్చారు. రాష్ట్ర మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్. మల్లారెడ్డి బోయిన్‌పల్లి లోని తన క్యాంపు కార్యాలయంలో కుటుంబసభ్యులతో కలసి దీపావళి వేడుకలు నిర్వహించారు. బాణాసంచా కాల్చారు. ఈ కార్యక్రమంలో భద్రారెడ్డి, మహేందర్ రెడ్డి, ప్రీతి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నేత అలకుంట హరి

లాలాపేట: దీపావళి వేడుకలను పురస్కరించుకుని పారిశుద్ధ్య కార్మికులకు బీఆర్‌ఎస్ నాయకులు చీరెలు పంపిణీ చేశారు. ఈ మేరకు శుక్రవారం లాలాపేటలోని ప్రొ జయశంకర్ స్టేడియం ఆవరణలో ఎస్‌ఎఫ్‌ఏ పోచాలు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రేటర్ యూత్ ప్రెసిడెంట్ ఆలకుంట హరి ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా పారిశుద్య కార్మికులకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు మల్లికార్జున్, శ్రీరామ్ సంతోష్ తదితరులున్నారు.

ఉత్సాహంగా దీపావళి



తక్షశిలా స్కూల్లో దీపావళి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

లాలాపేట: దీపావళి పర్వదిన వేడుకలను తార్నాక డివిజన్ ప్రజలు ఆనందోత్సవాల మధ్య జరుపుకున్నారు. తార్నాక, లాలాపేట, శాంతినగర్, మాణికేశ్వర్‌నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఇండ్లను, వ్యాపార సముదాయాలను పూలతో, రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తి శ్రద్ధలతో లక్ష్మీ పూజలు చేశారు. స్వీట్లు పంచుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

ఉత్సాహంగా సదర్



రసూల్‌పురా: దీపావళి పర్వదినం సందర్భంగా రసూల్‌పురా కృష్ణ గర్ కట్టమైసమ్మ బస్తీలో మల్లికార్జున యాదవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సదర్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. బేగంపేట సీఐ రామయ్య. బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై సదర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు మల్లేష్ యాదవ్,. శివ యాదవ్, వెంకన్న యాదవ్, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తుల పాదయాత్ర ప్రారంభం



సనత్‌నగర్: 38 రోజుల పాటు సాగే అయ్యప్పస్వాముల పాదయాత్ర శుక్రవారం ప్రారంభమైంది. బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని శివాలయం నుంచి జరిగే ఈ యాత్రను లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. ఎలాంటి విఘ్నాలు తలెత్తకుండా అయ్యప్పస్వాముల పాదయాత్ర కొనసాగాలని ఆకాంక్షించారు. అయ్యప్ప ఆశీస్సులతో 38 రోజుల పాదయాత్రను విజయవంతంగా పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి,శైలేందర్, కృష్ణముదిరాజ్, రవీందర్‌సాగర్, హరిచారి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణారెడ్డికి బీసీ నేతల అభినందనలు



క్రిష్టారెడ్డిని సన్మానిస్తున్న లింగంగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యమండలి నూతన ఛైర్మన్ ప్రొ.కిష్టారెడ్డికి బీసీ నేతలు అభినందనలు తెలిపారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ ఆధ్వర్యంలో ప్రొ.కిష్టారెడ్డిని కలసి మొక్కను అందచేసి శాలువతో సన్మానించి అభినందనలు తెలిపారు.

పండుగలు ఐక్యతను పెంపొందిస్తాయి



వేడుకల్లో పాల్గొన్న ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్‌ఖేరే

సనత్‌నగర్: పండుగలు ఐక్యతను పెంపొందింపజేస్తాయని ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్, కాంగ్రెస్ కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పవన్ ఖేరా అన్నారు. బేగంపేటలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత విశాల్ సూదం ఆధ్వర్యంలో గురువారం జరిగిన దీపావళి వేడుకల్లో పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కోట నీలిమతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా పండుగలు నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు ఏర్పాట్లు పూర్తి

- తుదిదశకు చేరిన శిక్షణ తరగతులు
- 530 మంది ఎన్యుమరేటర్లు
- 52 మంది పర్యవేక్షకులు



ఎన్యుమరేటర్ల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించడం కోసం జీహెచ్‌ఎంసీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 6 నుంచి ప్రారంభం కానున్న సర్వే కోసం ఎన్యుమరేటర్లు, పర్యవేక్షకులకు శిక్షణ తరగతులు తుదిదశకు చేరాయి. శుక్రవారం సీతాఫల్‌మండిలోని మల్టీపర్పస్ కమ్యూనిటీహాలులో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో సికింద్రాబాద్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్యుమరేటర్లకు సర్వే విధానాన్ని మార్గనిర్దేశనం చేశారు. సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలో అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ ఐదు డివిజన్లు ఉన్నాయి. ఐదు డివిజన్లకు కలిపి మొత్తంగా 530 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. బూత్‌లెవల్ ఆఫీసర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బందిని ఎన్యుమరేటర్లుగా నియమించారు. వీరి పనితీరును పర్యవేక్షించేందుకు 52 మంది పర్యవేక్షకులను, ఆపై నిర్ణయాలు తీసుకోవడం కోసం వివిధ విభాగాల జీహెచ్‌ఎంసీ అధికారులను నోడల్ అధికారులుగా నియమించారు. ఒక్కో సిబ్బంది 150–175 నివాసాలను సర్వే చేసేందుకు అవసరమైన శిక్షణ ఇచ్చినట్టు డిప్యూటీ కమిషనర్ సుభాష్‌రావు తెలిపారు. మొదటి దశలో మూడు రోజుల పాటు ప్రతీ ఇంటికి వెళ్లి ఇంటి నెంబర్ నమోదు చేస్తామని, రెండోదశలో కుటుంబ వివరాలను సేకరించి సమగ్రంగా నమోదు చేస్తామన్నారు. సర్వేలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కులానికి సంబంధించిన వివరాలతోపాటు ఆధార్ నెంబర్లను సేకరించనున్నామని చెప్పారు. మన్యుమరేటర్లకు ప్రశ్నావళి అందించి సమగ్రంగా వివరాలు సేకరించి నమోదు చేయాల్సిన అంశాల పట్ల పూర్తిస్థాయి శిక్షణ ఇచ్చామని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. ఎన్యుమరేటర్లు ఇంటికి వచ్చి వివరాలు నమోదు చేసుకునే సందర్భంలో ప్రజలంతా వాస్తవ వివరాలు, సమాచారం అందించి సహకరించాలని ఆయన కోరారు.

నాణ్యమైన విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఆర్పీఎఫ్, సీపీఐ నాయకులు

అడ్డగుట్ట: ప్రభుత్వాలు నాణ్యమైన విద్య అందించినప్పుడే సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, అసమానతలు నిర్మూలించవచ్చని సీఆర్పీఎఫ్ జిల్లా కార్యదర్శి చింతల లక్ష్మీనారాయణ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 3 న జరిగే సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం మారేడుపల్లి మండల కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ నాణ్యమైన విద్యను అందించినప్పుడే సమాజంలోని అన్ని సమస్యలు పరిష్కరించబడుతాయని, కానీ నేడు ప్రభుత్వాలు మారుతున్నా విద్యా రంగంలో సమస్యలు పరిష్కారం అవ్వడం లేదన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత పథకాలు కాదు పేద వర్గాల ప్రజలకు నాణ్యమైన విద్యను అందించేందకు ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. అదే విధంగా ఫీజుల పేరుతో పేద వర్గాల ప్రజల నెత్తురు తాగుతున్న ప్రైవేటు పాఠశాలల ఫీజుల దోపిడిని అరికట్టాలని డిమాండ్ చేశారు. కనీసం కాంగ్రెస్ ప్రభుత్వమైన ఫీజుల దోపిడిని అరికట్టి ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ నాయకులు కే. శ్రీనివాస్, కొమురెల్లి బాబు, శ్రీహరి ,మల్లేష్, తల్లుల సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ భాగ్యలక్ష్మి, మండల కన్వీనర్ జమున, పి.ఎల్. ప్రవీణ్, శోభ, శాంత, రామలీల, వరలక్ష్మి, ఎంవి ఫౌండేషన్ ఆర్గనైజర్‌లు సువర్ణ, భాగ్య, సుమలత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కార్తీక మాసం ప్రారంభం



కార్తీక మాస పూజలకు సిద్ధమైన మల్లికార్జున స్వామి

సనత్‌నగర్: హనుమాన్ దేవాలయం ప్రాంగణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి దేవాలయం, శివాలయంలో ఈ నెల 2 నుంచి డిసెంబర్ 1 వరకు కార్తీక మాస విశేష పూజలు జరుగుతాయని ఈఓ సత్యనారాయణ తెలిపారు. శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారికి నిత్య సహస్రనామార్చాన జరుగుతుందన్నారు. ఈ నెల 12న కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతములు, 13న క్షీరాబ్ధిద్వాదశి సందర్భంగా సామూహిక సాలగ్రామ–దీప–వస్త్ర–ఫల–స్వయంపాక దానములు జరిపించబడునని పేర్కొన్నారు. 15న కార్తీక పౌర్ణమి సందర్భంగా స్వామివారికిప్రత్యేకంగా సహస్ర దీపాలంకరణ సేవ ఉంటుందని వివరించారు. కార్తీక మాసం ప్రతి శనివారం, ఏకాదశి, ద్వాదశి, పౌర్ణమి రోజుల్లో తులసీ పుష్పాలంకరణ జరుగుతుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



లాలాపేట: ద్విచక్ర వాహనం ఢీ కొని గుర్తు తెలియని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. సుమారు 55 ఏళ్ల వయస్సున్న వ్యక్తి గురువారం తార్నాకలోని ఫైర్ స్టేషన్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా హబ్సిగూడ వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ ద్విచక్ర వాహనదారుడు ఆ వ్యక్తిని బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఆ వ్యక్తి రెండు కాళ్లకు, తలపై తీవ్ర గాయాలై అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 100కు ఫిర్యాదు చేశాడు. వెంటనే అక్కడికి చేరుకున్న ఓయూ పోలీసులు గాయపడ్డ వ్యక్తిని 108 అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. ప్రస్తుతం ఆ వ్యక్తి ఐసియులో చికిత్స పొందుతున్నాడు. ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారున్ని పట్టుకుని కేసు నమోదు చేశారు.

ఆర్పీరోడ్ గోదాములో అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఆర్పీరోడ్‌లోని ఓ గోదాములో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసికుంది. పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బాణ సంచా కాలుస్తుండగా నిప్పురవ్వలు ఎగిరి ఆర్పీరోడ్‌లో రెండవ అంతస్తులోని ఓ గోదాములో పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు పెద్దవి కావడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బంది, పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న వారు స్థానికులతో కలిసి గోదాములోని ఎలక్ట్రికల్ వస్తువులను తదితర సామాగ్రిని భయటకు తరలించారు.

ఇందిరకు ఘన నివాళి



ఇందిరాగాంధీకి నివాళులు అర్పిస్తున్న కోట నీలిమ

మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు నివాళులర్పించారు. సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఇందిరా గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఇందిర దేశానికి చేసిన సేవలను కొనియాడారు.



తార్నాకలో ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుకారాంగేట్‌లో ఇందిరా గాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఇందిరాగాంధీకి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

తొలగించిన పోలీసులను విధుల్లోకి తీసుకోండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఉద్యోగాల నుంచి సస్పెండ్ చేసి కానిస్టేబుల్స్‌ను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని తెలంగాణ డెమొక్రటిక్ స్టూడెంట్ ఫోరం (టీడీఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు విజయ్ నాయక్ సీఎం రేవంత్ రెడ్డిని శుక్రవారం డిమాండ్ చేశారు. కింది స్థాయి పోలీసు ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఇతర పేద వర్గాలకు చెందిన వారే పని చేస్తారని వారిని ఉద్యోగాల నుంచి తొలగించడం వలన కుటుంబాలు వీధిన పడుతాయన్నారు.

తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరిస్తాం

- ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్



తార్నాక జంక్షన్‌ను పరిశీలిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, జెడ్‌సీ రవికిరణ్

లాలాపేట: సుదీర్ఘకాలంగా మూసి ఉన్న తార్నాక జంక్షన్‌ను తిరిగి పునరుద్ధరించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగానే సిటీ కమిషనర్ ఆదేశాలతో ఇటు ట్రాఫిక్ విభాగం ఉన్నతాధికారులు ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ విశ్వప్రసాద్, జీహెచ్‌ఎంసీ జోనల్ కమీషనర్ రవికుమార్ ఇతర అధికారులు శుక్రవారం తార్నాక జంక్షన్‌ను సందర్శించారు. తిరిగి పునరుద్ధరించడానికి తీసుకోవాల్సిన చర్యలు, సాధ్యాసాధ్యాలపై సమీప ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ అడిషనల్ కమీషనర్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ ఓయూ నుంచి లాలాపేట వైపు, లాలాపేట నుంచి ఓయూ వైపు వెళ్లే వారు తార్నాక రహదారిలో యూ టర్న్‌లతో అదనంగా దాదాపు రెండు కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు. ఈ విధంగా వాహనదారుల ఇబ్బందులను తొలగించేందుకు తార్నాక జంక్షన్‌ను ఓపెన్ చేయడానికి కసరత్తు చేస్తున్నామన్నారు. దీనిపై ఇప్పటికే పలు మార్లు అధ్యయనం చేశామని పేర్కొన్నారు. జంక్షన్ ఓపెన్ చేయడానికి సెంట్రల్ ఐలాండ్ డెవలప్ చేయాలి, సేఫ్టీ మార్కింగ్, పెడస్ట్రల్ హైలాండ్‌ను 3 మీటర్లకు తగ్గించడం, లాలాపేట వైపు ఉన్న ఆర్టీసి బస్ షెల్టర్‌ను కొంత దూరం వరకు మార్చాలన్నారు. దాని కోసం జీహెచ్‌ఎంసీ అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. వచ్చే రెండు, మూడు వారాల్లోగా తార్నాక జంక్షన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసిపి అశోక్, ఏసిపి సంపత్‌కుమార్, ఇన్స్పెక్టర్ రాంబాబు, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

బోర్డు సీఈఓకు పలువురి శుభాకాంక్షలు



సీఈవో మధుకర్ నాయక్‌కు దీపావళి శుభకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే శ్రీగణేష్



ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతున్న దేవేందర్

రసూల్‌పురా: దీపావళి పర్వదినం సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను బోర్డు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, బోర్డు మాజీ సభ్యులు, బీఆర్‌ఎస్ నాయకురాలు నివేదిత వేర్వేరుగా పుష్పగుచ్చం అందజేసి శుభకాంక్షలు తెలిపారు. అదేవిధంగా పికెట్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో కంటోన్మెంట్ బోర్డు హెల్త్ సూపరిటెండెంట్ ఎం. దేవేందర్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను కలసి పుష్పగుచ్చం అందజేసి దీపావళి శుభకాంక్షలు తెలిపారు.



సీఈవో మధుకర్ నాయక్‌కు శుభకాంక్షలు తెలుపుతున్న బోర్డు మాజీ సభ్యులు

భక్తి శ్రద్ధలతో దీపావళి వేడుకలు



తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు పండుగ శుభాకాంక్షలు తెలిపిన బీఆర్‌ఎస్ నాయకులు



మహిళలతో కలిసి టపాకాయలు కాల్చిన మాజీ కార్పొరేటర్

అమీర్‌పేట: దీపావళి వేడుకలకు ప్రజలకు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.వేడుకల్లో భాగంగా అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి బీఆర్‌ఎస్ మహిళా నాయకులతో కలిసి టపాకాయలు కాల్చి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నేతలు సంతోష్,కూతురు నర్సింహ,కట్ట బల్‌రాం తదితరులు ఉన్నారు.

విద్యుత్ వెలుగులతో మోడల్‌కాలనీ కమాన్

సనత్‌నగర్: మోడల్‌కాలనీ కమాన్ సొబగులు అద్దుకుంది. విద్యుద్దీపాలతో జిగేల్ మంటుంది. గతంలో మోడల్‌కాలనీ పేరిట ఏర్పాటుచేసిన కమాన్ రాత్రివేళల్లో అంధకారం కారణంగా కనిపించేది కాదు. దీంతో కొత్తగా కాలనీలోకి వచ్చేవారు కాస్త అయోమయానికి గురయ్యేవారు. తాజాగా కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ చొరవతో విద్యుద్దీపాలతో కూడిన కమాన్‌ను పునః నిర్మాణం చేశారు. దీనిని కాలనీ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు దీపావళి రోజున దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి, ప్రధాన కార్యదర్శి బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.



మోడల్‌కాలనీ కమాన్‌ను ప్రారంభిస్తున్న అధ్యక్షుడు కొండల్‌రావు

చీకటిని పారదోలి వెలుగులు నింపే దివ్యమైన పండుగ దీపావళి

అమీర్‌పేట: చీకటిని పారదోలి వెలుగునందించే దివ్యమైన పండుగ దీపావళి అని ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా అన్నారు. దీపావళి సందర్భంగా సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కోట నీలిమతో కలిసి బల్కంపేట రేణుకా ఎల్లమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అజ్ఞానంపై జ్ఞానానికి, చెడుపై మంచికి విజయం సాధించే సందేశాన్నిచ్చేది దీపావళి పండుగ ప్రత్యేకతని తెలిపారు. ఆనందానికి, ఉత్సాహానికి ప్రతీకగా నిలిచే పండుగని పేర్కొన్నారు.



అమ్మవారిని దర్శించుకున్న ఏఐసీసీ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా